కథ

# అర్హత

ఎస్.ఉషాపద్మిని

**జూలై నెల ప్రకృతి అంతా ఆహ్లాదకరంగాఉంది. అటు ఎండ ఇటు చలి ఏ బాధ లేకుండా ఎంతో ఉల్లాసంగా ఉంది. నిండా ముసుగు కప్పుకుని పడుకున్న రఘు "లే నాన్నా, ఈరోజు ఆఫీసుకి వెళ్ళాలి. ఉద్యోగంలో చేరాలి" అన్న తల్లి మాటలు వినబడనట్లే ఊరుకున్నాడు.**

నిజానికి రఘుకి రాత్రంతా నిద్రే లేదు. మనసంతా చిరాగ్గా, అందరి మీదా కక్షగా ఉంది రఘుకి. ముఖ్యంగా మామయ్య మీద అయితే చెప్పక్కర్లేదు. మరికాసేపట్లో తన తండ్రి పని చేసిన ఆఫీసులోనే క్లర్కుగా జేరాల్సి ఉంది. అందరిలాగే ఎన్ని కలలో కన్నాడు జీవితం గురించి రఘూ. దేశవిదేశాలు వెళ్లాలని ఊహించుకున్నాడు. విసుక్కుంటూ లేచి రెడీ అయ్యాడు.

"అన్ని సర్టిఫికెట్లు పెట్టుకున్నావా జాగ్రత్త బాబూ" అంటున్న తల్లికేసి విసుగ్గా చూసి బైక్‌స్టార్ట్ చేసి ఆఫీసుకి బయలుదేరాడు రఘు.

ఇంజనీరింగ్ కాలేజ్‌కి వెళ్ళాల్సిన నేను ఒక మామూలు గుమాస్తా అవతారం ఎత్తాల్సి వచ్చింది. అలాగని నేనేం తెలివితక్కువ వాడినేం కాదే. ఇంజనీరింగ్‌లో వెయ్యి రాంకు వచ్చింది. రేమోమాపో కౌన్సిలింగ్ తర్వాత కాలేజ్‌లో చేరటం అనుకుంటుండగా నాన్న ఏక్సిడెంట్‌లో చనిపోయాడు. నాన్నంటే ఎంతో ఇష్టపడే నాకు అదే పెద్దదెబ్బ అనుకుంటే ఈ గుమాస్తా ఉద్యోగం ఊహించని శరాఘాతంలా తగిలింది. అమ్మకి కనీస అర్హత లేదు, తను చేరితే స్వీపరు పోస్టో, అటెండరు పోస్టో ఇస్తారు. తమ్ముడు, చెల్లికి వయస్సు లేదు. నాకు మాత్రం ఇంటరు పూర్తయ్యి ఈ ఉద్యోగానికి అర్హత పొందిన వయస్సు అయ్యింది. కుటుంబ పోషణ నిమిత్తం నేనే ఈ అవతారం ఎత్తక తప్పలేదు. నాన్న ఇంత సడన్‌గా చనిపోవాలా? అయినా పోయాడు సరే తమదంత కూటికి లేని కుటుంబం కాదు కదా. అమ్మ పాపం నేనంటే విపరీతమైన ప్రేమతో నన్ను ఎలాగైనా ఇంజనీరు చేయాలనే తపనతో తనే అటెండర్ పోస్టుకు సిద్ధమైతే మామయ్య, అమ్మమ్మ ఎంత ఎత్తున ఎగిరారు? ఇంత బ్రతుకు బ్రతికీ ఇంటి వెనకాల చచ్చినట్లు ఆఫీసు తుడుస్తూ, కాఫీలు, టీలు అందిస్తూ పనిమనిషిలా మారతావా అని.

"ఉద్యోగంలో చేరకపోతే కొంత డబ్బుని ఇస్తారట, ఈయన స్నేహితుడు వెంకట్రావు చెప్పారు. అది బ్యాంకులో వేసుకుని ఉన్న పొలం ఆయన తర్వాత వచ్చే పెన్షనుతో నెట్టుకొస్తాను" అంది ఇంత బాధలోనూ అమ్మ.

ఎప్పుడైనా తనేమైనా సాయం చేయాల్సి వస్తుందో అని భయంతో కాబోలు మామయ్య..."గవర్నమెంటు ఉద్యోగం ఈ కాలంలో రావడమే కష్టం అంటే వచ్చే ఉద్యోగం వదులుకుంటానంటావా. అయినా ఇంజనీరింగ్ అంటే మాటలా. అంత ఖర్చుపెట్టి చదివించాక ఉద్యోగం రాకపోతే ఉన్నదంతా వీడికే ఊడ్చి మిగిలిన పిల్లల్ని ఏం చేస్తావు?" గట్టిగా అరచి నాకే ఈ గుదిబండ తగిలించాడు.

ఎంత అవమానం? చిన్నతనం? రేపట్నించి ఫ్రెండ్సంతా ఇంజనీరింగ్ కాలేజ్‌కెళ్ళి జాలీగా లైఫ్ ఎంజాయ్ చేస్తుంటే నేను మాత్రం చుట్టూరా ఫైల్స్‌తో కుస్తీపడుతూ పై ఆఫీసర్ల చేత తిట్లు, చివాట్లు తింటూ వారికి అడుగు అడుగునా దండాలు, పెడ్తూ బ్రతకాలా? ఎన్ని కలలు కన్నాను. ఇంజనీరింగ్ పూర్తిచేసి అమెరికా వెళ్ళి బోల్డు సంపాదించాలని ఎంత ఆశపడ్డాను. తన పైన తనకే ఎందుకో జాలిగా ఉంది. ఇలా ఆలోచిస్తూనే ఆఫీసు చేరాడు రఘు.

రఘు తండ్రి రామారావు సర్వీసులో ఉన్నంతకాలం అందరిచేత మంచివాడనీ, సిన్సియర్ అనీ మన్ననలు పొందటం చేత పైగాఎప్పటి నుండో ఒకే ఆఫీసులో ఉండటం చేత అతని తోటివారంతా కష్టపడి రఘుకి అదే ఆఫీసులో పోస్టింగ్ వచ్చేలా చేసారు. తమకు ఎంతో ఇష్టుడు అయిన రామారావు కొడుక్కి తమ చేతనైన సాయం చేయవచ్చనే ఉద్దేశంతో.

ఆఫీసులో అడుగు పెట్టగానే ఎంతో సాదరంగా ఆహ్వానించారు రఘుని. ఆఫీసర్ దగ్గర్నుంచి అటెండరు వరకూ రామారావు మంచితనం గుర్తుచేసుకుని ఏ సాయం కావాలన్నా తమ దగ్గరకు రమ్మనీ మొహమాట పడద్దనీ మరీ మరీ చెప్పారు. వాళ్ళంతా ప్రేమగా మాట్లాడుతున్నా ఊకొట్టి ముభావంగా ఉండిపోయాడు రఘు. తనేంటి ఈ లోక్లాసు ఉద్యోగం చేయటమేంటి అన్న భావన అతనిలో పాతుకుపోయింది. ఎవరితోనూ కలిసేవాడు కాదు. ఏదో యాంత్రికంగా తన విధులు నిర్వర్తిస్తూ రెండు నెలలు గడిపేసాడు.

ఈ రెండు నెలల్లో అతని ధోరణి అందరికీ అసంతృప్తి కలిగించినా రామారావు కొడుకు తమకూ కొడుకే అన్నట్లు మౌనంగా ఉంటున్నారు.

రాను రాను రఘూ ప్రవర్తన అందరికీ విసుగు తెప్పించింది. చీటికి మాటికీ విసుక్కోటం ఎవరైనా పెద్దవారు సలహా చెప్తే పొగరుగా ప్రవర్తించటం, ఏదీ ఖాతరు చేయకపోవటం ఇవన్నీ కొందరికి బాధ, కొందరికి ఆగ్రహం తెప్పించాయి.

ఇదంతా గమనిస్తున్న రామారావు ప్రాణ స్నేహితుడు వెంకట్రావుకి రఘులో పొగరు, నిర్లక్ష్యం కాదు అంతకు మించి ఏదో న్యూనతా భావం ఉందనిపించింది. ఎదిగే వయసులో తండ్రిని కోల్పోవడం వలన వచ్చిందో లేక ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించలేక వచ్చిందో ఆ న్యూనతా భావం తొలగించాలి. లేకపోతే రాను రాను రఘు జీవితం తనకే కాదు ఎవరికీ సుఖం శాంతి లేకుండా మారుతుందని రఘుతో మాట్లాడి ఆ సమస్య పరిష్కరించాలి అని గట్టిగా నిర్ణయించుకుని రఘు సీటు వద్దకు వచ్చాడు వెంకట్రావు.

"రఘూ సాయంత్రం ఆఫీసు కాగానే వెళ్ళిపోకు, నీతో కొంచెం మాట్లాడే పనుంది" అన్నాడు వెంకట్రావు.

రఘూ ఎప్పట్లానే విసుక్కుంటూ "నాతో మీకు మాట్లాడే పని ఏంటి? ఆఫీసు పనైతే ఇక్కడే చెప్పండి" అన్నాడు చిటపటలాడుతూ.

"మీ నాన్న ప్రాణ స్నేహితుడిని నేను. నాన్నే నీతో మాట్లాడతానంటే వద్దంటావా?" అని మరో మాటకి తావు లేకుండా తన సీటు దగ్గరకి వెళ్ళిపోయాడు వెంకట్రావు.

గవర్నమెంటు ఆఫీసు కాబట్టి ఐదు అవగానే దాదాపు సగం ఆఫీసు ఖాళీ అయిపోయింది. కొంచెం సేపటికి ఏ కళనున్నాడో రఘూ వచ్చి వెంకట్రావుతో "చెప్పండి. ఏదో మాట్లాడాలని అన్నారు" అన్నాడు.

"ముందు నువ్వు కూర్చో రఘూ. నువ్వొక విషయం గమనించావా? నువ్వు చేరిన కొత్తలో ఆఫీసు స్టాఫు నీతో ఎలా ఉండేవారు? ఇప్పుడు ఎలా ఉంటున్నారు అన్న విషయం. అందరికీ నీ ప్రవర్తన వలన మనసులు బాధపడినట్లున్నాయి. అందరూ నిన్ను తిట్టుకుంటున్నారు. అయినా ఎందుకు ఎప్పుడూ విసుక్కుంటూ, చిటపటలాడుతూ ఉంటావు. ఎవరితోనూ కలవ్వేంటి? మనకు ట్రాన్స్‌ఫర్లు అంతగా ఉండవు. ఇక్కడే చాలాకాలం పనిచేయాల్సిన వాడివి, ఎంతో పైకి రావాల్సిన వాడివి అందరితోనూ మంచిగా ఉండాలి కానీ ఇలా ప్రవర్తించకూడదమ్మా" మృదువుగా అన్నాడు వెంకట్రావు.

అప్పటికే ఉక్రోషంతో ఉన్న రఘు ఇంకాస్త కోపంతో తన బాధ ఎవరి దగ్గరైనా వెళ్ళగక్కాలనే ఆలోచనతో "అనుకుంటే అనుకోనివ్వండి. అయినా నా ఖర్మకొద్దీ ఇక్కడ చేరాను కానీ లేకుంటే హాయిగా ఇంజనీరింగ్‌లో చేరాల్సినవాడిని. నా అర్హతకు నా తెలివికి తగిన ఉద్యోగమా మీరే చెప్పండి. చిన్నప్పట్నించీ మెరిట్ స్టూడెంట్‌నని నాన్న చెప్పే ఉంటారు. నాకసలు ఈ ఉద్యోగంలో చేరటమే ఇష్టం లేదు. అందుకే ఎవరన్నా కోపం లేదు కానీ ఏం చేయాలన్నా విసుగ్గా ఉంటుంది. దేనిపైన మనసు లగ్నం కావటం లేదు" అసలు సంగతి బయట పెట్టాడు రఘు.


"నువ్వు చెప్పింది నూటికి నూరుపాళ్ళు కరెక్టే రఘూ. అన్నీ సవ్యంగా జరిగితే నువ్వు ఎంతో ఎదగాల్సిన కుర్రాడివి. మీ నాన్న నాతో ఎప్పుడూ నీ గురించే చెప్పే

వాడు. మా రఘు మాకు కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెడ్తాడురా అని. కానీ ఏం చేస్తాం? సడన్‌గా జరగకూడనిది జరిగింది. ఇది నీకు తగిన ఉద్యోగం కాదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కుటుంబానికి నువ్వే ఆధారం అయ్యావు. ఇంత చిన్న వయసులో బరువు బాధ్యతలు నెత్తికెత్తుకునే అవసరం వచ్చింది. ఇష్టం ఉన్నా లేకున్నా ఇంటికి పెద్దకొడుకుగా నీకీ బాధ్యత తప్పదు.

ఇక అర్హతను బట్టి ఉద్యోగాలు చేసేవాళ్ళు ఈరోజుల్లో ఎంతమంది ఉంటున్నారు నువ్వే చెప్పు. నేటి సమాజ పరిస్థితుల దృష్ట్యా తప్పనిసరి అయ్యి ఒక మెట్టు దిగైనా కుటుంబాన్ని పోషిస్తున్నారు చాలామంది. దాని కోసం అవసరమైతే తమ అర్హతలను దాచుకుంటున్నారు కూడా. అంతవరకు ఎందుకు మన అటెండరు ఎమ్‌ఏ చేశాడు. అయినా దొరికిన గవర్నమెంటు ఉద్యోగం వదలకూడదని అటెండరుగానే చేరిపోయాడు. అదీ రిజర్వేషన్ కోటాలో. కుటుంబ పోషణ దృష్ట్యా మారుతున్న జీవన సరళి దృష్ట్యా ఈ కాలంలో లక్షల మంది రాజీపడి తన అర్హతకు ఏమాత్రం పొంతన లేని పనులు చేస్తున్నారు. మన పక్కనుండే కలెక్టరాఫీసుకు వెళ్ళావా ఎప్పుడైనా?" అడిగాడు వెంకట్రావు.

"లేదండీ ఇంతవరకూ అవసరం రాలేదు"

"ఈసారి వెళ్తే అక్కడ లలిత అనే అటెండర్ ఉంటుంది చూడు. చూసేందుకు ఏదో పెద్ద ఉద్యోగస్తురాలులా ఉంటుంది. కానీ అటెండర్ ఉద్యోగం చేస్తున్నందుకు ఎవరేం అడిగినా విసుక్కోకుండా అందిస్తుంది. ఆవిడ ఒక కలెక్టరు భార్య. ఆవిడ భర్త నిజాయితీగా ఉన్నందుకు కాంట్రాక్టర్లు దారుణంగా హత్య చేశారు. అది సరిపోక రావాల్సిన డబ్బు, బెనిఫిట్సు సరిగా రానివ్వకుండా చేశారు. ఈవిడకు పూర్తిగా చదువు కొనసాగించకుండానే మానిపించి మేనమామ అని ఆ కలెక్టరుకు ఇచ్చి పెళ్ళి చేసారుట. చిన్నపిల్లలు, ముసలి అత్తామామలు, కనీస విద్యార్హత లేదు. అయినా కుటుంబ పోషణ నిమిత్తం అటెండరుగానే చేరిపోయింది. ఎంతోమంది నవ్వారు. హేళన చేసారు. పట్టించుకోలేదు. కలెక్టరు భార్య హోదాలో బ్రతికింది. నౌకర్లు, కార్లు, ఇన్ని భోగాలు అనుభవించింది. కానీ ఒక మెట్టు దిగి అయినా తనపైన ఆధారపడి ఉన్నవారికి నీడను ఇవ్వాలి అనుకుంది. ఎప్పుడూ తను చేస్తున్న పనికి సిగ్గుపడలేదు. ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొని పిల్లల్ని పైకి తీసుకొచ్చింది. గత పదిహేనేళ్ళుగా ఆ ఆఫీసులో పనిచేస్తూ అందరికీ తలలో నాలుకలా ఉంటూంది. ఒకప్పుడు ఆమెను చూసి హేళన చేసే వాళ్ళ చేతనే కలెక్టరుకు భార్య అయినా గర్వం లేదు అన్పించుకుని అందరి హృదయాల్లో స్థానం సంపాదించుకుంది. ఇదంతా నీకెందుకు చెప్తున్నానంటే మన అర్హతకు మన హోదాకు తగిన ఉపాధి దొరక్కపోతే దొరికిన దానితో తృప్తిపొంది అందులో ఆనందం వెతుక్కోవాలి. మనం చేసే ప్రతీ పనిని ప్రేమించాలి. అప్పుడే అందులో మాధుర్యం మనకు తెలుస్తుంది. అయినా ఈ ఉద్యోగంతోనే నీ జీవితం ఆగిపోదుగా. ప్రైవేటుగా డిగ్రీ పరీక్షలు రాసి క్వాలిఫికేషను పెంచుకోవచ్చు. డిపార్టుమెంటల్ పరీక్షలు రాసి పై స్థాయికి చేరుకోవచ్చు. ఇంకా కష్టపడితే డిగ్రీ పూర్తయ్యాక సివిల్ సర్వీసెస్‌కు ప్రయత్నించవచ్చును. ఇంతకన్నా కఠినమైన పరిస్థితుల నుంచి వచ్చి జీవితంలో విజయం సాధించిన వారు ఎందరో ఉన్నారు.



రైతు కూలీలు, రిక్షా తొక్కుతున్నవారు లాంటి నిరుపేదలకు పుట్టిన పిల్లలు కేవలం జీవితంలో పైకి రావాలనే ఉద్దేశ్యంతో ఎన్నో కష్టాలకోర్చి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. నిజానికి వారికున్న ప్రతికూల పరిస్థితులతో పోలిస్తే నీదెంత గొప్పస్థాయో నీకు తెలుస్తుంది.

అందరి జీవితాలు పూల బాటలు కావు. దారిలో రాళ్ళు, ముళ్ళు ఏరుకుంటూ మన బాట శుభ్రంగా చేసుకుని మనమే సాఫీగా నడిచేందుకు ప్రయత్నించాలి. అప్పుడే జీవితంలో పైకి రాగలవు. చాదస్తంగా ఇదంతా చెప్తున్నానని అనుకోకు. మీ నాన్నే ఉంటే నీకీ తిప్పలు ఉండేవి కావు. అనుకూల పరిస్థితుల్లో సాధించిన విజయం కన్నా ప్రతికూల పరిస్థితులను అధిగమించి సాధించిన విజయమే ఎవరికైనా తృప్తినిస్తుంది. జీవితం సుఖం చేసుకోవటం దాన్ని స్వర్గంగా మార్చుకోటం మన చేతుల్లోనే ఉంది. పద ఇప్పటికే పొద్దుపోయింది. మీ అమ్మగారు కంగారుపడ్తారు" అని రఘు భుజం తట్టాడు వెంకట్రావు.

రఘు తనకు తెలియకుండానే ఆలోచనలో పడ్డాడు. అసలంటూ ఆలోచించటం మొదలుపెడితే ఎప్పటికైనా అతని దృక్పథంలో మార్పు వచ్చే అవకాశం ఉందన్నమాటేగా.

☆